
సాక్షి
గుంటూరు
మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



రేపు విశ్వకర్మ యజ్ఞం

క్రోసూరు:గుంటూరుజిల్లా ఉద్దండరాయుని పాలెంలో బుధవారం విశ్వకర్మ యజ్ఞం జరుగుతుందని విశ్వకర్మ సంఘం ప్రతినిధి సిద్దు కామేశ్వరాచారి సోమవారం తెలిపారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 42,250 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 17,000 క్యూసెక్కులు వదులుతున్నారు.



నారీ–స్వశక్తి పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో బుధవారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు నిర్వహించే స్వస్త్ నారీ–స్వశక్తి పరివార్ అభియాన్ పోస్టర్‌ను సోమవారం జేసీ సూరజ్‌గనోరే ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

ఏఎన్‌యూలో ఘనంగా ఇంజినీర్స్ డే



పెదకాకాని(ఏఎన్‌యూ): భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ వైఆర్ హరగోపాల్‌రెడ్డి సెమినార్ హాల్‌లో సోమవారం సివిల్ విభాగం ఆధ్వర్యాన ఇంజినీర్స్‌డే–2025 కార్యక్రమం ఘనంగాజరిగింది. ముఖ్య అతిథిగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు విచ్చేసి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు తమ లక్ష్యాలు నిర్దేశించుకోవాలని తెలిపారు. విశిష్ట అతిథి రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ జి.బ్రహ్మయ్య మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్‌లోని స్టేట్, సెంట్రల్ ప్రైవేట్ ఉద్యోగావకాశాల గురించి వివరించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్యచిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, సివిల్ ఇంజినీరింగ్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు.

పీజీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో జూలైలో జరిగిన పీజీ కోర్సుల రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు సోమవారం విడుదల చేశారు. ఎంఎస్సీ స్టాటిస్టిక్స్‌లో 45 మందికి 44 మంది, ఎంఎస్సీ బయోకెమిస్ట్రీలో 24 మందికి 17మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 24వ తేదీలోగా ఒక్కో పేపరుకు రూ.1860, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.2190 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణ ప్రచార రథం ప్రారంభం



గుంటూరుమెడికల్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ప్రచార రథాన్ని సోమవారం గుంటూరు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 15 రోజులపాటు జిల్లాలో ఈ ప్రచార రథం పర్యటిస్తుందన్నారు. ప్రజా సమూహాలు, మురికివాడలలో పర్యటిస్తూ ప్రజలకు హెచ్ఐవి/ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన కల్పిస్తారన్నారు. మరింత సమాచారం కోసం 1097 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం మేనేజర్ డాక్టర్ శాంసన్ పాల్గొన్నారు.

మానవత్వం చూపిన పోలీసులు



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని హుస్సేన్ కట్ట వద్ద గత నాలుగు రోజులుగా మతిస్థిమితం లేని ఓ మహిళ తిరుగుతోంది. ఇది గమనించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రవీంద్రనాయక్ తక్షణమే స్పందించి సోమవారం ఉదయం ఆ మహిళను మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విజయవాడ గిరిపురం అని తప్ప ఆమె ఇంకేమీ వివరాలు వెల్లడించలేక పోతోందని, ఆమె చెప్పిన ప్రాంతానికి పోలీస్ సిబ్బందిని పంపించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

శ్రీవైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు

తెనాలి: పట్టణంలోని శ్రీ శరణాగతి గోష్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి మంగళశాసనాలతో సోమవారం స్థానిక నాజరుపేటలోని లక్ష్మీనగర్‌లో శ్రీ వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకుడు నరేంద్ర రామానుజదాసస్వామి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు వేడుకలను ఆరంభించారు. 64 ప్రసాదాల నివేదన, తీర్థ ప్రసాదాల వితరణతో కార్యక్రమం ముగిసింది. నరేంద్ర రామానుజ దాసస్వామి కృష్ణాష్టమి, విశిష్టతను ప్రవచించారు. ఎం.రమణయ్య, చందు రామారావు, టి. సీతారామయ్య పాల్గొన్నారు.



పాత్రికేయులను భయపెడుతున్నారు



వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల హక్కు. ఆ హక్కును కూటమి ప్రభుత్వం హరించడం దారుణం. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను, అక్రమాలను ఎత్తిచూపుతూ వార్తలు రాసినందుకే సాక్షి ఎడిటర్, సిబ్బందిపై కేసులు నమోదు చేయడం దుర్మార్గం. ప్రజల పక్షాన నిలబడే పత్రికలపై ప్రభుత్వం జులుం ప్రదర్శిస్తుంది. అడ్డగోలుగా కేసులు నమోదు చేస్తున్నారు. పత్రికలపై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలి. విలేకరులకు స్వేచ్ఛ ఇవ్వాలి. లేకుంటే భవిష్యత్తులో ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదం.

–ఎండీ ఫిరోజ్,
వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి

ప్రజాస్వామ్యం ఖూనీ



ప్రజలకు వాస్తవాలను తెలిపే పత్రికలపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడం, దాడులు చేయడం, వేధించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలు, అరాచకాలపై రాజకీయ నాయకులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లు, ప్రసంగాలను ప్రచురించారనే ఆరోపణలతో పోలీసులు సాక్షి దినపత్రిక ఎడిటర్, సిబ్బందిపై కేసులు నమోదు చేయడం కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారి లోపాలను ఎత్తిచూపే పత్రికలపై కేసులు పెట్టి వేధించడం దారుణం. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికలు నిర్వీర్యమైపోతాయి. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ విషయంలో పునరాలోచించుకోవాలి. ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలించాలి.

–చిల్లపల్లి మోహనరావు, ఆప్కో మాజీ చైర్మన్

తురకపాలెం మరణాలపై కట్టుకథలు

- హెచ్ఐవీ మరణాలని ఒకరోజు..
- తాగుబోతులని మరో రోజు..
- తమ వైఫల్యాలను ఆర్ఎంపీపైకి నెట్టే ప్రయత్నం మరోరోజు...
- తాగునీటిలో యురేనియం అవశేషాలని ఇంకో రోజు...
- ఎల్లో మీడియాతో దుష్ప్రచారం

కారణాలు తేల్చకుండా సమస్యను పక్కదోవ పట్టిస్తున్న ప్రభుత్వం



తురకపాలెం గ్రామం ఏరియల్‌వ్యూ(ఫైల్)

సాక్షిప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న కుగ్రామం తురకపాలెం. పాడిపంటలతో కళకళలాడుతున్న గ్రామం నేడు మరణ మృదంగంతో ఆందోళనలో ఉంది. గ్రామంలో మూడు నాలుగు నెలల నుంచి వరస మరణాలు చోటుచేసుకుంటున్నా ఇప్పటివరకూ మరణాలకు గల కారణాలు నిర్ధారణ కాలేదు. గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో ప్రజలంతా మరణ భయంతో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవితాలను నెట్టుకొస్తున్నారు. మీడియాలో వరుస కథనాలతో చలనం తెచ్చుకున్న ప్రభుత్వ యంత్రాంగం వారం రోజులపాటు గ్రామంలో హడావుడి కార్యక్రమాలు చేపట్టింది. ప్రతిరోజూ ఉచిత వైద్య శిబిరాలు, ఆహారం, భోజనం, ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి ప్రజలు ఇన్‌ఫెక్షన్ బారిన పడకుండా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం ప్రయత్నం ఏమాత్రం ఫలించలేదు. ప్రజల్లో వరుస మరణాలపై ఉన్న భయాలు ఏమాత్రం తొలగిపోలేదు. అంతేకాకుండా రోజురోజుకు గ్రామ ప్రజలు ఎందుకు చనిపోతున్నారనే మిలియన్ డాలర్ల ప్రశ్నకు సమాధానం దొరక్క డెత్ ఫోబియాతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

కారణం తేల్చని సర్కారు

తురకపాలెం గ్రామంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు 29 మరణాలు సంభవించినట్లు వైద్య అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. వీటిల్లో ఒక మరణం అత్యంత అరుదైన మెలియాయిడోసిస్ వ్యాధిగా నిర్ధారించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఇతర మరణాల్లో గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ బాధితులు ఎక్కువ అని లెక్కలు తేల్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సెప్టెంబరు మొదటి వారంలో తురకపాలెం గ్రామంలో మరణ నివేదికను ప్రభుత్వానికి అందజేసి మరణాలు సంభవించకుండా గ్రామంలో వరుసగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్, పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది, సూపర్‌స్పెషలిస్టులు, స్పెషలిస్టు వైద్యులు గ్రామంలో సుమారు 40 రకాల పరీక్షలు చేస్తున్నారు. అయినప్పటికీ గ్రామ ప్రజల మరణాలకు గల కారణాలను పూర్తిస్థాయిలో ఇప్పటి వరకు ఎవరూ నిర్ధారించలేకపోయారు. దీంతో చావుల భయాలు ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి.

మిస్టరీగానే తురకపాలెం మరణాలు

తురకపాలెంలో 29 మంది అధికారికంగా చనిపోయినట్లు ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందజేసిన జిల్లా యంత్రాంగం మరణాలకు గల కారణాలను తేల్చకపోవడంతో తురకపాలెం మరణాలు మిస్టరీగానే మిగిలిపోయాయి. ప్రభుత్వ యంత్రాంగం, ఎందుకు మరణాల మిస్టరీని ఛేదించలేకపోతుందో ఎవరికీ అర్థం కాని ప్రశ్నగా మిగిలింది. మిస్టరీ ఛేదన లేకపోవడంతో గ్రామ ప్రజల వేదన తీర్చలేకపోతున్నారు.



ఒకరిపై ఒకరు నెపాలు

తురకపాలెం వరుస మరణాలపై ప్రభుత్వ శాఖల్లో సమన్వయం లోపించి మిస్టరీ ఛేదన జరగలేదన్నది జగమెరిగిన సత్యం. ఏ శాఖకు ఆశాఖ తమ తప్పేమీ లేదు, తమ పరిధిలో ఎలాంటి నిర్లక్ష్యం జరగలేదనే ధోరణిలో ప్రభుత్వానికి నివేదికలు సమర్పించే ప్రయత్నం చేస్తున్నాయి. మరికొంత మంది ఒక్క అడుగు ముందుకేసి తప్పిదాలను కింది స్థాయి సిబ్బందిపై నెట్టివేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. తొలుత గ్రామంలో వరుస మరణాలకు అతిగా మద్యం సేవించడం కారణమనే అంచనాలపై నివేదికలు సిద్ధం చేశారు. దానిని పక్కనపెట్టేసి నీటిలో, మట్టిలో ఏమైనా హానికర రసాయనాలు ఉండవచ్చని మరో నివేదిక సిద్ధం చేశారు. మరలా దానిని పక్కనపడేశారు. అత్యంత అరుదైన మెలియోడోసిస్ వ్యాధితో ఒక్కరు మాత్రమే మరణిస్తే మిగతా మరణాలకు కారణాలని తేల్చడంలో విఫలం చెందారు. గ్రామ స్థాయిలో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది వరుస మరణాల నివేదికను జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు సకాలంలో అందించలేదని, అందువల్లే మరణాల కట్టడి చేయలేకపోయామంటూ మరొక నివేదిక సిద్ధం చేసి, కింది స్థాయి వైద్య సిబ్బందిపై వేటుకు రంగం సిద్ధం చేశారు. ఈలోగా మరో కొత్త ఆలోచన వారి మదిలో మెదిలి గ్రామంలోని ఆర్ఎంపీలపై వేటు వేసేందుకు కొత్త ప్రణాళిక సిద్ధం చేశారు. అధిక మొత్తంలో యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్స్ వాడడం ద్వారా మరణాలు సంభవించాయంటూ ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేశారు. అయితే ఆ గ్రామంలో కాకుండా పక్కన ఉన్న పెదపలకలూరులో ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేశారు. గ్రామంలో నాలుగు ఆర్ఎంపీ క్లినిక్‌లు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ మందులు, ఇంజక్షన్లు రోగులకు ఇస్తూనే ఉన్నారు. మిగితా ముగ్గురిని వదిలేసి ఒక్కరిపై మాత్రమే వేటు వేయడంతో పలు అనుమానాలకు దారితీసింది. మరోపక్క నీటిలో యూరేనియం నిల్వలు ఉన్నాయని, వాటి ద్వారా మరణాలు సంభవించవచ్చని పచ్చమీడియా ప్రచారం చేసింది. మరోపక్క గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధి వల్లే మరణాలు సంభవించాయంటూ మరో కథనం ప్రచారం చేసింది. సాక్షాత్తు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి గ్రామానికి వచ్చి మరణాలకు గల కారణాలు మీడియాకు వెల్లడించలేదు. ఎందుకంటే ఆయన వచ్చే సమయానికి నివేదిక సిద్ధం కాలేదు. ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందజేసినప్పటికీ అధికారికంగా జిల్లా యంత్రాంగం నేటి వరకు మరణాలకు కారణాలను వెల్లడించలేదు. పలు మలుపులు తిప్పుతూ మరణాల మిస్టరీని ఛేదించకుండా ప్రభుత్వ యంత్రాంగం కాలయాపన చేసే కొలది గ్రామ ప్రజల్లో మరణ భయం అలాగే ఉండిపోతుంది. మూడు నెలలుగా కంటిపై కునుకు లేకుండా గ్రామ ప్రజలను వేధిస్తున్న డెత్ మిస్టరీని ప్రభుత్వం త్వరితగతిన ఛేదించి ప్రజల్లో భయాందోళనను తొలగించి భరోసా కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఆధారం లేకుండా పోయింది...



చిన్నప్పుడే అమ్మ, నాన్నలు చనిపోతే నాన్నమ్మ అంకమ్మ వద్ద పెరిగాను. నాకు ఇద్దరు అన్నదమ్ములున్నారు. అందులో కుటుంబానికి సంపాదించి పెట్టే పెద్దన్న పెద మూర్తి మరణించాడు. దీంతో మాకు రోజు గడవడమే కష్టంగా ఉంది. ప్రభుత్వం ఆదుకుని నాకు ఉద్యోగంతోపాటు నష్టపరిహారం చెల్లించాలి.

– ఎం.తిరుపతమ్మ, తురకపాలెం.

మొత్తుకున్నా పట్టించుకోలేదు ...



గతేడాది ఆగస్ట్ నెలలోనే మా ఊళ్లో నీరు తాగడం వల్ల అస్వస్థతకు గురయ్యారు. దీంతో మా ఊళ్లో కొందరు ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నాం. అప్పుడు ఎవ్వరూ స్పందించలేదు. మా కుటుంబానికి అండగా ఉండే నా భర్త దీనరాజ్ కల్తీ నీటికి బలి అయ్యారు.

–కె.భాగ్యరాణి, తురకపాలెం.

ఎందుకోసం ఈ ప్రభుత్వం



ఒకరి తర్వాత ఒకరు వచ్చి పోతున్నారు. పట్టించుకునే నాథుడే లేడు. పేదల కోసం కష్టపడుతున్నామంటున్న ఈ ప్రభుత్వ పెద్దలు ఆ పేదలే అకాల మరణాలకు గురైతే ఎందుకు పట్టించుకోవడం లేదు. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారు. కల్తీ నీటి కారణంగా నా భర్త ఇశ్రాయెల్ మరణించారు. నాకు ముగ్గురు ఆడపిల్లలు. ఆధారం లేకుండా పోయింది.

– సంగా మరియమ్మ, తురకపాలెం

ఇంకెంత కాలం గడిపేస్తారు



మూడు నెలల కాలంలో 30 మంది మరణిస్తే ప్రభుత్వం ఇంకా ఏం చేస్తుంది. ఇంకా ఎంతకాలం గడిపేస్తారు. ఇంకా ఎంత మంది ప్రాణాలు పోతే స్పందిస్తారు. నా భర్త లక్ష్మయ్యను పోగొట్టుకున్నాను. పేదల కష్టాలు పట్టించుకోకుండా పెద్ద పెద్ద భవనాలు కట్టి ఇదే అభివృద్ధి అంటే ఎలా.

– డి.లక్ష్మి, తురకపాలెం.

తురకపాలెం బాధితులకు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్
- బాధితులతో కలసి జేసీకి వినతిపత్రం అందజేత
- ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవత్సవకు వినతిపత్రం అందజేస్తున్న బలసాని కిరణ్‌కుమార్, బాధితులు

గుంటూరు వెస్ట్: పేదల ప్రాణాలు పిట్టల్లా రాలిపోతుంటే ఆదుకోవాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని, బాధితుల గోడు దేవుడే వినాల్సిన పరిస్థితి నెలకొందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తురకపాలెం బాధిత కుటుంబాలతో కలిసి సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవత్సవను కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కిరణ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ రెండు మూడు నెలల్లోనే 30 మంది దళిత, బీసీ, మైనారిటీ కుటుంబాలకు చెందిన పేదలు మరణిస్తే ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఏదో కెమికల్ కలవడం వల్లే మరణాలకు సంభవించాయని, రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ నీళ్లలో ఏదో కలిసిందని అందుకే చనిపోయారని, స్థానిక ఎంమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కల్తీ మద్యం సేవించడం వల్ల చనిపోయాడరని తమకు ఇష్టం వచ్చిన స్టేట్‌మెంట్లు ఇస్తున్నారన్నారు. ఎవరికి వాళ్లు తప్పించుకునే ప్రయత్నంలో ఉన్నారని పేర్కొన్నారు.

పేదలకు న్యాయం చేసే ఉద్దేశంలో ఎవరు లేరని అన్నారు. పేదల కోసం పనిచేస్తామని దొంగ వాగ్దానాలు చేసిన ప్రభుత్వం అదే పేదలు మరణిస్తున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. మరణాలకు 5 నెలల ముందు బాధిత కుటుంబ సభ్యులు నీటి సమస్యలపై పీజీఆర్ఎస్‌తోపాటు స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందజేశారన్నారు. ఏ ఒక్కరూ అటువైపు తొంగి చూడలేదని పేర్కొన్నారు. అణగారిన వర్గాల గొంతుగా వైఎస్సార్ సీపీ పనిచేస్తుందన్నారు. బాధితుల తరఫున రాజీలేని పోరాటం చేస్తున్నామని, బాధిత కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్టు వెంకటప్పారెడ్డి, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వంగా సీతారామిరెడ్డి, నాయకులు బోరుగడ్డ రజనీకాంత్, పిల్లి మేరి, క్రాంతి, బ్రహ్మయ్య, సుధారాణి పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో సమన్వయం అవసరం

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు వెస్ట్: అర్జీల పరిష్కారంలో వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరమని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ప్రజలల్లో సంతృప్తి స్థాయిని పెంచేలా అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం వచ్చిన 221 అర్జీలను జేసీ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, డీఆర్ఓ షేక్ ఖాజావలి, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డీఎస్ఓ కె.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయిలతో కలసి స్వీకరించారు.



అధ్వానంగా రోడ్డు, డ్రెయిన్‌లు

గుంటూరు నగరంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. తవ్వేసిన రోడ్లు, కాలువలు సకాలంలో పూర్తి చేయరు. ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుంది. ఏటీ అగ్రహారంలో రోడ్లు, డ్రెయిన్లు పూర్తిస్థాయిలో ఎప్పుడు బాగు చేస్తారు. బ్రాడీపేట, కోబాల్డ్‌పేట ప్రాంతాల్లోనూ డ్రెయిన్‌లు, రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పట్టించుకోండి.

–సునీల్, గుంటూరు.

యానాదులకు స్థిర నివాసం కల్పించండి



గుంటూరులోని 51వ వార్డులోని కాకుమానువారితోటలోని కార్మిక శాఖ స్థలంలో 20 ఏళ్ల నుంచి 22 యానాది కుటుంబాలు నివాసముంటున్నాయి. మౌలిక సదుపాయాలు లేవు. వర్షాల కారణంగా కాలనీ మొత్తం మునిగిపోతుంది. వారికి స్థిర నివాసం ఏర్పాటు చేయండి.

–బాధితులు, బహుజన మహాసభ నాయకులు, గుంటూరు.

కొత్త టీచర్లు వస్తున్నారు

- డీఎస్సీ 2025 ఎంపిక జాబితా విడుదల
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,140 పోస్టులు భర్తీ
- విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఎంపిక జాబితా
- 22 నుంచి ఇండక్షన్ శిక్షణ తరగతులు
- దసరా సెలవుల తరువాత పాఠశాలలకు కేటాయింపు
- దరఖాస్తు సమయంలో ఇచ్చిన ఆప్షన్ ఆధారంగానే పోస్టింగ్స్



గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. డీఎస్సీ–2025లో ఎంపికైన అభ్యర్థుల జాబితాను విద్యాశాఖ విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,140 పోస్టులను భర్తీ చేయనున్నట్లు జాబితాలో పొందుపర్చారు. వాస్తవానికి ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో 1,159 ఖాళీలు ఉన్నట్లు డీఎస్సీ నోటిఫికేషన్‌లో చూపగా, 19 పోస్టులకు అభ్యర్థులు లేకపోవడంతో వాటిని భర్తీ చేయకుండా నిలిపివేశారు.

దరఖాస్తు సమయంలో ఇచ్చిన ఆప్షన్ ఆధారంగానే పోస్టింగ్స్

ఒకటికి మించి రెండు, మూడు పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఉండగా, దరఖాస్తు సమయంలో ఇచ్చిన ఆప్షన్ ఆధారంగానే వారిని ఒక పోస్టుకు ఎంపిక చేశారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు దరఖాస్తు సమయంలో ఎస్జీటీ పోస్టును ఎంపిక చేసుకుని ఉంటేవారిని హైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు బదులుగా ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీగానే ఎంపిక చేసి, నియామకపత్రాలు వెబ్‌సైట్‌లో పెట్టారు. భర్తీ చేయనున్న పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్ 620, ఎస్జీటీ 520 ఉన్నాయి.

ఈనెల 22 నుంచి ఇండక్షన్ శిక్షణ

డీఎస్సీ–2025 ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 22 నుంచి ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దసరా సెలవుల తరువాత పాఠశాలలను కేటాయించి, సంబంధిత ఉపాధ్యాయులను పాఠశాలలకు పంపనున్నారు.

డీఈవో సైట్‌లో డీఎస్సీ– 2025 ఎంపిక జాబితా

గుంటూరు జిల్లాలో డీఎస్సీ–2025 ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన అన్ని కేటగిరీల వారీగా ఎంపిక జాబితాను డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాకాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. అదే విధంగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంతో పాటు జిల్లా కలెక్టరేట్‌లోని డిస్‌ప్లే బోర్డులలో జాబితాను ఉంచామని, అదనపు సమాచారం కోసం డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలని సూచించారు.

గుంటూరులో హత్య.. గుండ్లకమ్మలో శవం!



రామాంజనేయులు (ఫైల్)

మద్దిపాడు/లక్ష్మీపురం: గుంటూరులో హత్యకు గురైన వ్యక్తి ప్రకాశం జిల్లా మద్దిపాడు సమీపంలోని గుండ్లకమ్మ నదిలో శవమై తేలాడు. అందిన సమాచారం ప్రకారం.. వేముల రామాంజనేయులు(45) కనిపించకపోవడంతో భార్య గుంటూరులోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గుంటూరు పోలీసులు బండారు కొండయ్యను అదుపులోకి తీసుకుని విచారించారు. రామాంజనేయులును హత్య చేసి మద్దిపాడు మండలం వెల్లంపల్లి సమీపంలోని గుండ్లకమ్మ నది పక్కన పూడ్చి వేసినట్లు అంగీకరించాడు. గుంటూరు పోలీసులు సోమవారం రాత్రి 7:30 గంటల సమయంలో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు తరలించారు. గుంటూరు పోలీసులకు మద్దిపాడు ఎస్ఐ సైదులు సహకారం అందించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,200 గరిష్ఠం : రూ. 2,800

మోడల్ ధర రూ. 2,500

పసుపు ధరలు (సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 353

కొమ్ములు : 179 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ : (ధర రూ॥ల్లో)	మోడల్ :
9,350	10,225	10,000

కాయలు : 174 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,350	10,561	10,000

మొత్తం అమ్మకాలు : 264.75 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం (సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	33,865
అమ్మకాలు	31,395
నిల్వ	8,678

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,300
నంబరు–5	10,000–13,400
273	10,500–13,500
341	10,000–15,000
4884	10,000–14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,200
నంబరు–5	10,000–13,500
341	11,000–15,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,000
బాడిగ–355	10,000 – 16,000
దేవనూరు డీలక్స్	10,500 – 13,800
ఆర్మూర్	9,800 – 12,500
తాలుకాయలు	6,200 – 7,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–15,000
బాడిగ – 355	10,000–15,700
దేవనూరు డీలక్స్	10,500–14,500
తాలు	5,200 – 7,200

–కొరిటెపాడు (గుంటూరు)

27 నుంచి వీణా అవార్డ్స్ నాటక పోటీలు

- జాతీయస్థాయిలో పంచమ పద్య, సాంఘిక నాటక, నాటికల పోటీలు
- ఆరు రోజుల పాటు 21 ప్రదర్శనలు
- ముగ్గురు నాటక రంగ ప్రముఖులకు స్మారక పురస్కారాలు



మాట్లాడుతున్న సాయిమాధవ్ బుర్రా

తెనాలి: కళల కాణాచి, ఆర్‌ఎస్‌ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుంచి జాతీయ స్థాయి పంచమ పద్యనాటక, సాంఘిక నాటక, నాటికల వీణా అవార్డ్స్–2025 పోటీలు జరగనున్నాయి. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఈనెల 27వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు మొత్తం ఆరురోజుల పాటు అలరించనున్నాయి. కళల కాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, ప్రధాన కార్యదర్శి, సినీ నటుడు గోపరాజు విజయ్ సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో పోటీలను ప్రకటించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక పారితోషికాలను అందిస్తున్న ఏకైక పరిషత్ తమదిగా సాయిమాధవ్ వెల్లడించారు.

భారీ బహుమతులు

ప్రతి విభాగంలో మొదటి మూడు బహుమతులకు బంగారు వీణ, రజత వీణ, కాంస్య వీణతోపాటు పద్య నాటకానికి ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు, ప్రదర్శించిన ప్రతి పద్య నాటకానికి రూ.50 వేలు, రచయితకు అదనంగా పారితోషికం అందిస్తున్నామని గుర్తు చేశారు. సాంఘిక నాటకాలకు ప్రతి ప్రదర్శనకు రూ.40 వేలు, బహుమతులుగా రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, నాటికల్లో ప్రతి ప్రదర్శనకు రూ.30 వేలు, బహుమతుల కింద రూ.50 వేలు రూ.40 వేలు, రూ.30 వేలు ఇస్తున్నట్టు తెలిపారు.

నాటకరంగ ప్రముఖులకు స్మారక పురస్కారాలు

ప్రదర్శనల రోజుల్లో ఏఆర్ కృష్ణ జాతీయ పురస్కారాన్ని సత్రాజు బాలచందర్‌కు, వేద గంగోత్రి వర ప్రసాద్ పురస్కారాన్ని నూతలపాటి సాంబయ్యకు, బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని ఉప్పలపాటి సైదులుకు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్ మాట్లాడుతూ ఆరు రోజుల్లో తొమ్మిది పద్య నాటకాలు, అయిదు సాంఘిక నాటకాలు, ఏడు సాంఘిక నాటికలు ఉంటాయని చెప్పా రు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల్నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. గౌర వ సలహాదారులు గోగినేని కేశవరావు, వేమూరి విజయ భాస్కర్, ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, సంయుక్త కార్యదర్శులు అయినాల మల్లేశ్వరరావు, కొండముది రమేష్‌బాబు, దేవరపల్లి భవాని, కళాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

తాడేపల్లి రూరల్ : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే బాలబాలికల జట్లను సోమవారం తాడేపల్లి గుడ్ న్యూస్ స్కూలులో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కె. మహేష్, కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ 51వ జూనియర్, బాయ్స్ గరల్స్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఈనెల 25న కృష్ణాజిల్లా గొల్లపూడిలో జరుగనున్నాయని తెలిపారు. ఈ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి బాలికల టీమ్‌లో 15 మంది, బాలుర టీమ్‌లో 15 మందిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు వచ్చినట్లు తెలిపారు. సెలక్షన్ కమిటీలో సుబ్బరాజు, అర్జున్, రాష్ట్ర వ్యాయామ అధ్యక్షులు కరిముల్లా చౌదరి, ఆరోగ్యదాసు, నూతక్కి రవి, రమేష్‌బాబు, మెల్లెంపూడి రవి, హరికృష్ణ, రాంబాబు, సాంబశివరావు, రజనీ నాయక్ ఉన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పీఆర్సీ కమిషన్ వేయకపోవడం మోసగించటమే..

- ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు
- సత్తెనపల్లిలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన ప్రదర్శన

సత్తెనపల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 2023 జూలై నుంచి 12వ పీఆర్సీ వర్తింపజేయాల్సి ఉండగా సమయం దాటి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు కమిషన్‌ను నియమించక పోవడం ఉద్యోగులను మోసగించటమేనని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలు పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు నిరసన వారం 5వ రోజు కార్యాచరణలో భాగంగా సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయం నుంచి సోమవారం ర్యాలీగా వెళ్లి తాలూకా కేంద్రం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనకు ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ మొహమ్మద్ ఇబ్రహీం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంటనే పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఉద్యోగుల సొమ్ము 10 శాతాన్ని పెట్టుబడిదారులకు దోచిపెట్టే కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీము రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. మెమో నంబర్ 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ వర్తింపజేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే కలిసొచ్చే సంఘాలతో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



సత్తెనపల్లిలో నిరసన ప్రదర్శన చేస్తున్న ఏపీటీఎఫ్ ఉద్యోగ, ఉపాధ్యాయులు

పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు బాళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని, బోధనేతర యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ హెల్త్ ప్రీమియం చెల్లిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, పరీక్షలలో అసెస్మెంట్ బుక్‌లెట్ విధానం వల్ల ఉపాధ్యాయుల బోధన సమయం హరించడమే కాకుండా పిల్లలకు ఏమాత్రం ఉపయోగం లేదని చెప్పారు. అసెస్మెంట్ బుక్ లెట్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాలూకా పరిధిలోని మండలాల ఏపీటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు శివారెడ్డి, ఫిరోజ్ ఖాన్, .దర్మారావు, ఐతమ్‌రాజు,రవికుమార్, శ్రీధర్, సుభాని, సాబీర్, చంద్రం, రమేష్,రామకృష్ణ, హఫీస్, కోటేశ్వరరావు, సునీల్, వెంకటేశ్వరరావు వినోద్, సమద్ ఖాన్, నాసరయ్య, సుబ్బారెడ్డి, ఇలియాస్, శేషగిరి, అత్తరున్నీసా, లెనిన్‌రాణి, శ్రీదేవి, తులసి, కుదిషియా పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం !

ఏఎస్పీ జీవీ రమణమూర్తి

నగరంపాలెం: నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా ఫిర్యాదులు – పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) నిర్వహించారు. జిల్లా ఏఎస్పీ జీవీ రమణమూర్తి (పరిపాలన) బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. బాధితుల బాధలను ఆలకించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఫిర్యాదులకు సంబంధించి పోలీస్ అధికారులతో మొబైల్ ఫోన్‌లో మాట్లాడారు. నిర్ణీత వేళల్లో చట్ట పరిధిలో అర్జీలు పరిష్కరించాలని జిల్లా ఏఎస్పీ ఆదేశించారు. డీఎస్పీలు భానోదయ (గుంటూరు దక్షిణ), శ్రీనివాస రెడ్డి (మహిళా పీఎస్) అర్జీలు స్వీకరించారు.



వృద్ధ దంపతుల సమస్య ఆలకిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

వడ్డీ పేరుతో వేధింపులు

సుమారు రెండేళ్ల క్రితం స్నేహితుల అవసరాల నిమిత్తం నా కుమారుడు మేడికొండూరు కొత్తపాలేనికి చెందిన వ్యక్తి వద్ద లక్ష రూపాయాలు అప్పుగా తీసుకున్నాడు. స్నేహితులు తీసుకున్న నగదు చెల్లించకపోవడంతో నెలనెలా వడ్డీ కింద అతనికి రూ.10 వేలు చెల్లిస్తున్నాం. అయితే, గత నెల చెల్లించలేదు. దీంతో సదరు వ్యక్తి ఇంటి వద్దకు వచ్చి నానాయాగీ సృష్టించాడు. అమర్యాదగా మాట్లాడాడు. దీంతో కొడుకు తట్టుకోలేక నెల కిందట నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. ప్రస్తుతం ప్రాణాలతో బయటపడ్డాడు. రెండు రోజుల కిందట మళ్లీ అతను ఇంటి వద్ద గొడవ సృష్టించాడు. దీంతో అప్పటికప్పుడు అప్పుగా ఓ రూ.50 వేలు తీసుకొచ్చి, అతనికి చెల్లించాం. అయినప్పటికీ మిగతా సొమ్ము చెల్లించాలని లేదా ఇబ్బందులు ఎదుర్కొంటారని బెదిరిస్తున్నాడు.

– మిరియాల మల్లీశ్వరి, చుట్టుగుంట

భర్త, కుటుంబ సభ్యుల వేధింపులు

పెళ్లయిన దగ్గర్నుంచి భర్త సక్రమంగా పనులకు వెళ్లేవాడుకాదు. ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. రోజు వారీ పనులకు వెళ్తూ నేనే కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఈ క్రమంలో భర్త, బావ, కుటుంబ సభ్యులు ఏకమై, వేధింపులకు గురిచేస్తున్నారు. ఆస్తికి సంబంధించి ఎటువంటి హక్కు లేదంటూ తీవ్రంగా హింసిస్తున్నారు. పనులకు వెళ్లేటప్పుడు రహదారులపై భర్త అడ్డగించి, చితకబాదేవాడు. నెలనెలా వచ్చే డబ్బులు ఇంటి ఖర్చులకు సరిపోతున్నాయి. పెద్ద కుమార్తెను ఇంటర్ రెండో సంవత్సరం చదివించలేక ఇంటి వద్దనే ఉంటుంది. చిన్న కుమార్తెను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదివించుకుంటున్నా. ఇద్దరు ఆడ పిల్లల భవిష్యత్‌తో ఆడుకుంటున్నారు. సుమారు రెండేళ్లుగా నెహ్రూనగర్‌లోని పుట్టింటికి వచ్చి జీవిస్తున్నాను.

– బి.రేవతి, నెహ్రూనగర్ ఒకటో వీధి

భర్త వేధింపులు

ఇరవై ఏళ్ల కిందట పెళ్లైంది. భర్త బేల్దారి పనులు చేస్తాడు. కొద్దికాలంగా నేను క్యాన్సర్‌తో బాధపడుతున్నా. ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నా. అమరావతి చెంచుకాలనీలో ఐదు సెంట్ల డాబాలను నాకు, సోదరి షకీలాబేగానికి ఆరేళ్ల కిందట తండ్రి జాయింట్ రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆ తర్వాత చనిపోయారు. నా పేరుపై ఉన్న సగ భాగం కూడా సోదరి షకీలా బేగానికి విక్రయిస్తానని భర్త చెప్పి, ఆమె వద్ద దఫాల వారీగా రూ.16 లక్షలు తీసుకున్నాడు. అయితే, భర్త మాటలు నమ్మి, నా అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా ఏడాది కిందట భర్తకు సగ భాగం రిజిస్ట్రేషన్ చేయించా ! అయితే సీతమ్మకాలనీ జీరో వీధిలో మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. గత గురువారం భర్త వద్దకు వెళ్లి, అమరావతి చెంచు కాలనీలో ఇంటిని కుమార్తె పేరుపై రాయాలని కోరా. ఇంట్లో ఉన్న ఆసుపత్రి కాగితాలు, కుమార్తె పుస్తకాలు ఇప్పించాలని భర్తను ప్రాధేయపడ్డా. నాపై కనికరించకపోగా చితకబాదాడు. అక్కడే స్పృహ కోల్పోగా, సోదరి ఆసుపత్రిలో చూయించింది. న్యాయం చేయాలని కోరుతున్నా.

– షేక్ ఆషాబేగం, సీతమ్మ కాలనీ

ఇబ్బందులకు గురిచేస్తున్న పెద్ద కొడుకు

హైదరాబాద్‌లో ఉద్యోగం చేసే పెద్ద కొడుకు ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. వట్టిచెరుకూరు యమార్తిలో ఉన్న పొలం రిజిస్ట్రేషన్ చేయించాలంటూ తమపై తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాడు. అదేమని అడిగితే తమపై దాడులకు పాల్పడుతున్నాడు. అదిగాక మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగాలేని చిన్న కొడుకు రవి ఉన్నాడు. తమ తదనంతరం ఆస్తి అతనిదే అని చెప్పినా ఆలకించడంలేదు. చరమాంకంలో ఉన్న తమపై చిత్రహింసలకు గురి చేస్తున్నారు.

– పి.నాగమల్లేశ్వరరావు, అరుణకుమారి, వట్టిచెరుకూరు మండలం

గుంటూరు జిల్లాలో వర్షపాతం వివరాలు

- గుంటూరు పశ్చిమలో 125.2 మి.మీ వర్షం
- నగటున 31.5 మి.మీ వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. గుంటూరు నగరంలో ఆదివారం సాయంత్రం సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపిలేని భారీ వర్షం కురిసింది. జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 125.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 6.4 మి.మీ వర్షం పడింది. సగటున 31.5 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు తూర్పులో 88.2 మి.మీ., పెదకాకాని 54.2, కాకుమాను 54, దుగ్గిరాల 45.6, మంగళగిరి 43, కొల్లిపర 38.4, తాడికొండ 26.6, పెదనందిపాడు 26.4, తాడేపల్లి 17.6, మేడికొండూరు 16.8, చేబ్రోలు 9.2, తుళ్ళూరు 8.4, ప్రత్తిపాడు మండలంలో 7.6 మి.మీ చొప్పున వర్షం పడింది. ఈ నెల 15వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 79.7 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 137.3 మి.మీ. నమోదైంది.

గంజాయి విక్రేత అరెస్టు

మంగళగిరి టౌన్ : గంజాయి కలిగిఉన్న ఓ యువకుడ్ని మంగళగిరి పట్టణ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి పట్టణ పరిధిలోని కొప్పురావు కాలనీలో నివాసముంటున్న మణికంఠ అనే యువకుడు గత కొంత కాలంగా పట్టణ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల్లో నివాసముంటున్నాడు. గంజాయి విక్రేతలపై పట్టణ పోలీసులపై నిఘా ఉంచారు. ఇందులో భాగంగా మణికంఠ వద్ద గంజాయి ఉందన్న సమాచారంతో పట్టణ సీఐ వీరాస్వామి సిబ్బందితో అతడి ఇంటిపై దాడి చేశారు. అదే సమయానికి గంజాయి పొట్లాలను కడుతూ ఉన్నాడు. అతడిని పట్టుకుని, ఇంటిని సోదా చేశారు. సుమారు 1500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఒక యువకుడి వద్దే ఇంత మొత్తంలో గంజాయి దొరకడంతో ఎక్కడ నుంచి వస్తోందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మణికంఠ కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారం ఉండడంతో అతనిపై నిఘా ఉంచామని పేర్కొన్నారు.

చింతలపూడిలో జాతీయ మీడియా ప్రతినిధుల పర్యటన

దుగ్గిరాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సమిత్వ పథకం అమలు, పనితీరు పరిశీలనకు జాతీయ మీడియా ప్రతినిధులు, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు సోమవారం దుగ్గిరాల మండలం చింతలపూడిలో పర్యటించారు. ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సమిత్వ రాష్ట్ర డైరెక్టరు ఎ.నిశాంత్ రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమిత్వ సర్వే చేసిన విధానం వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న సమిత్వ రీ సర్వే గురించి, గ్రామ సభ విధులు నియమావళి వివరించారు. సర్వే మూడు దశల్లో ఉంటుందని, మార్చి 2026 నాటికి రాష్ట్రంలో పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సమిత్వ అసిస్టెంట్ డైరెక్టరు మహేష్ కుమార్, పంచాయతీరాజ్ ఎండీ చందన, డీపీవో సాయి కుమార్, డీఎల్‌పీఓ స్వరూపారాణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.చంద్రమోహన్, డెప్యూటీ ఎంపీడీఓ కె.జె. నెహ్రూ, గ్రామ సర్పంచ్ టి.రామకృష్ణ, ఈఓ మణికంఠ, బృంద సభ్యులు పాల్గొన్నారు.



సమిత్వ రాష్ట్ర డైరెక్టరు ఎ.నిశాంత్ రెడ్డి

మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిరస్మరణీయుడు

సత్రశాల(రెంటచింతల): ఇంజినీరింగ్ రంగంలో అసాధారణ ప్రతిభతో అత్యున్నత శిఖరాలను అధిరోహించి మన దేశ ఖ్యాతిని చాటిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారత జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ అని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ జీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం విశ్వేశ్వరయ్య జయంతి నిర్వహించారు. ప్రాజెక్ట్ ఆవరణలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా దేశ వ్యాప్తంగా ఇంజినీర్స్ డేను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. జలాశయాల నిర్మాతగా, ఆర్థికవేత్తగా శాశ్వత కీర్తి గడించిన విశ్వేశ్వరయ్యను భారత ప్రభుత్వం 1955లో భారత రత్న పురస్కారంతోను, బ్రిటీష్ ప్రభుత్వం బ్రిటీష్ నైట్‌హుడ్‌గా సన్మానించిందన్నారు. హైదరాబాద్, ముంబాయి నగరాలకు డ్రెయినేజీ వ్యవస్థ రూపకల్పన, విశాఖపట్నం పోర్టు ఏర్పాటులో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈఈ సుబ్రహ్మణ్యం, డెప్యూటీ ఈఈలు జయశంకర్, గిరిబాబు, మహమ్మద్, మతిన్, ఏఈలు వెంకటరమణ, మల్లేష్, ఏఈఈ శ్రీలత పాల్గొన్నారు.



విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిబ్బంది

వృద్ధురాలిపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్

నగరం: మండలంలోని చినమట్లపూడి శివారు దళితవాడలో అరవై సంవత్సరాల వృద్ధురాలిపై అత్యాచారం చేసి మరణానికి కారణమైన నిందితుడు వసుమతి విజయ్‌కుమార్ అలియాస్ విజయ్‌ను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రేపల్లె రూరల్ సీఐ సురేష్‌బాబు సమాచారం మేరకు.. చినమట్లపూడి శివారు దళితవాడలో సుశీలమ్మపై ఈనెల 2వ తేదీ తెల్లవారుజాము సమయంలో అదే గ్రామానికి చెందిన విజయ్ అత్యాచారం చేయడంతో మృతి చెందింది.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు.విచారణలో విజయ్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆధారాలు లభించాయని చెప్పాడు. నిందితుడిని శిరిపూడి నాగమ్మ కొట్టు సెంటర్ వద్ద సోమవారం అరెస్ట్ చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ బండ్ల భార్గవ్ పాల్గొన్నారు.

రేపు వారధి వార్షిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్థాయి వారధి వార్షిక పోటీలు బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో వ్యాసరచన, వక్తృత్వం అంశాలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వ్యాసరచనలో విద్యార్థుల మానసిక ఆరోగ్యం పెరుగుదలపై పాఠశాలల పాత్ర లేదా భారతదేశ పరిస్థితుల దృష్ట్యా ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన మూడు ముఖ్యమైన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అనే అంశాలపై పోటీ ఉంటుందని వివరించారు. వక్తృత్వంలో విద్యార్థుల అభ్యాసన పెంపుదలపై సామాజిక మాధ్యమాల పాత్ర లేదా భారతదేశ అభివృద్ధికి సంబంధించి ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అంశంపై పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనేందుకు 8, 9, 10వ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మాత్రమే అర్హులని వివరించారు.